దరఖాస్తుల ఆహ్వానం

విద్యానగర్, ఫిబ్రవరి 27: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం కింద వైద్యాధికారులు-4 స్టాఫ్ నర్స్-21 ఎంఎల్‌హెచ్ పీ-13, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్-1, ఫార్మసిస్టు-3, డేటా ఎంట్రీ ఆపరేటర్-1, ఆప్టో మెటరిస్ట్-1 కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18-45 ఏళ్ల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుందన్నారు. ఎక్స్ సర్వీస్ మెన్ ఎన్‌సీసీ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్లకు రూ. 500, మిగతా పోస్టులకు రూ.300 డీడీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, కరీంనగర్ పేరిట తీయాలన్నారు. దరఖాస్తులను మార్చి రెండో తేదీ వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో స్టడీ సర్టిఫికెట్లు, నివాస ధ్రువీకరణ పత్రంతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో సమర్పించాలని పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట బీఎంఎస్ ధర్నా

కలెక్టరేట్, ఫిబ్రవరి 27: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఎంఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేశ్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం, అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పసుల శ్రావన్, తొర్తి శ్రీనివాస్, రేణికుంట శంకర్, మొగిలిపాలెం తిరుపతి, నక్క అరుణ్, రమణయ్య, శ్రీను, కళవ్వ, చిన్నవ్వ, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- సెక్టోరియల్ అధికారులకు శిక్షణ

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 27: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సెక్టోరియల్ అధికారులకు మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై సెక్టార్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సామగ్రి పంపిణీ నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమకు గానీ, సంబంధితాధికారులకు గానీ వెంటనే చెప్పాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సొంత నిర్ణయాలు తీసుకోరాదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, వృద్ధుల కోసం పోలింగ్ కేంద్రానికొక వీల్ చైర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని సూచించారు. కాగా, మానకొండూర్, కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎస్‌వోలు, అధికారులకు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, ఎన్నికల సామగ్రి నోడల్ అధికారి మాధవి, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ కనకయ్య, ఎంఈవో మధుసూదనాచారి, ట్రైనర్లు తిరుపతిరెడ్డి, రజనీష్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, పరశురాములు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన నాగరాజు

మానకొండూర్, ఫిబ్రవరి 27: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావును మంగళవారం రాష్ట్ర నాయకుడు గడ్డం నాగరాజు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, పార్టీ నాయకులు ఉన్నారు.

కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగరాజు

విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్-దీవెన దంపతులు

పోచమ్మ గుడికి విరాళం

గంగాధర, ఫిబ్రవరి 27 : బూరుగుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయంలో విగ్రహాలు, ధర్వాజల కోసం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్-దీవెన దంపతులు రూ.1,00,116 విరాళాన్ని మంగళవారం బూరుగుపల్లిలోని వారి నివాసంలో అందజేశారు. విరాళం అందజేసిన మాజీ ఎమ్మెల్యే దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, నాయకులు దూలం శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

- పలు చోట్ల ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మలు దహనం

కరీంనగర్‌లో ఏసీపీ నరేందర్‌కు ఫిర్యాదు పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాంనగర్, ఫిబ్రవరి 27: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ప్రజాహిత యాత్రలో ఎంపీ బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. నగరంలోని ఇందిరా చౌక్‌లో మంగళవారం బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అదే సమయంలో బీజేపీ నాయకులు కూడా నిరసన తెలిపేందుకు అక్కడికి వస్తున్నారన్నా సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏసీపీ నరేందర్ ఆధ్వర్యంలో పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకొని నచ్చజెప్పారు. కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి మాట్లాడుతూ, పొన్నం ప్రభాకర్‌కు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, నాయకులు ఏసీపీ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే, బండి సంజయ్‌పై కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి సీపీకి ఫిర్యాదు చేశారు. రాజీవ్‌చౌక్‌లో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద పార్టీ కరీంనగర్ రూరల్ మండలాధ్యక్షుడు షహనాజ్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

రాముడి పేరు ఎత్తకుండా పోటీ చేసే దమ్ముందా?

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి రాముడి పేరు ఎత్తకుండా పోటీ చేసే దమ్ముందా అని కాంగ్రెస్ సీనియర్ నేత, కుల సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం సవాల్ చేశారు. నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్ డిపాజిట్ గల్లంతు అవుతుందని జోస్యం చెప్పారు.

కొత్తపల్లి, ఫిబ్రవరి 27: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎంపీ బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు కిమ్ ఫహాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బండి సంజయ్‌కుమార్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

శంకరపట్నం/ తిమ్మాపూర్/ కమాన్‌చౌరస్తా/ చొప్పదండి/ హుజూరాబాద్ టౌన్/ గన్నేరువరం, ఫిబ్రవరి 27: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎంపీ బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు వివిధ మండలాల్లో నిరసన తెలిపారు. శంకరపట్నం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై అంబేద్కర్ విగ్రహం వద్ద, తిమ్మాపూర్ మండలం అలుగునూర్ చౌరస్తాలో, గన్నేరువరంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే ఆయనపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని హుజూరాబాద్, చొప్పదండి, గన్నేరువరం పోలీస్ స్టేషన్లలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు.

ఉద్రిక్తతల నడుమ 'బండి' ప్రజాహిత యాత్ర

చిగురుమామిడి, ఫిబ్రవరి 27: మండలంలోని బొమ్మనపల్లిలో మంగళవారం ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర ఉద్రిక్తతల మధ్య సాగింది. ప్రజాహిత యాత్రలో భాగంగా సోమవారం రాత్రి బండి సంజయ్ చిగురుమామిడిలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. రాత్రి బొమ్మనపల్లిలో సంజయ్ బస చేసిన క్యాంపును ముట్టడించేందుకు ఉదయాన్నే కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. క్యాంపులోకి వెళ్లేందుకు యత్నించగా, అక్కడే ఉన్న బీజేపీ నాయకులు ప్రతిఘటించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ, సిద్దిపేట పోలీసుల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. విషయం తెలుసుకొని క్యాంపునకు వెళ్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి సద్దుమణిగిన తర్వాత పోలీసులు యాత్రకు అనుమతించడంతో యథావిధిగా సాగింది. అలాగే, చిగురుమామిడి బస్టాండ్ వద్ద కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు ఉల్లంపల్లి, హుస్నాబాద్ రహదారిపై సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. కాగా, సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని చిగురుమామిడి, హుస్నాబాద్ ఠాణాల్లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. మరోవైపు కాంగ్రెస్ శ్రేణుల తీరుపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులకు అవగాహన

సైదాపూర్, ఫిబ్రవరి27: మండలకేంద్రంలోని సైదాపూర్ రైతువేదికలో మంగళవారం రైతులకు పంటలసాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో నిఖిల్‌కుమార్ మాట్లాడుతూ, రైతులు పంటలకు ఎరువులు వేసేటప్పుడు యూరియాతో పాటు పొటాష్‌కూడా అందించాలని, దీనివల్ల మొక్కలకు తెగుళ్లను తట్టుకునే శక్తి పెరుగుతుందని తెలిపారు. అగ్గితెగులు నివారణకు యూరియా వాడకాన్ని తగ్గించి, పొలం గట్ల వద్ద కలుపును ఎప్పటికప్పుడు తీసేయాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు రవి, సూర్య పాల్గొన్నారు.

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి 27: మండలంలోని నుస్తులాపూర్, మల్లాపూర్ రైతు వేదికల్లో మంగళవారం వరిలో చీడపీడలు, రసాయన ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్లాపూర్ రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి మమత మాట్లాడుతూ, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల వరిలో తెగుళ్ల ఉధృతి పెరుగడంతో పాటు జింక్ లోపం వచ్చే అవకాశం ఉందన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమాల్లో ఏఈవోలు స్వామి, రఘు, మల్లాపూర్ పంచాయతీ సెక్రటరీ పద్మ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం, ఫిబ్రవరి 27: సస్యరక్షణ చర్యలతో రైతులు పంటల దిగుబడి పెంచుకోవాలని ఆత్మ పీడీ ప్రియదర్శిని సూచించారు. తాడికల్, మొలంగూర్ క్లస్టర్ రైతు వేదికల్లో రైతులకు పంటల తెగుళ్ల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319447-All

PLOT FOR SALE

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720.
NT-313892

NAME CHANGE

★Polu Sharada Vani, D/o. Polu Shankaraiah (Before Marriage) changed my name as Swargam Vani W/o Swargam Naresh (after marriage) Huzurabad Dist, Karimnagar T.S. Hence forth I shall be called as Swargam Vani W/o Swargam Naresh All purpose.
NTK-317481

CHANGE OF NAME

★I, VANGA SHEKHAR, R/o. H.No. 5-10, Mogilipet, Mallapur, Jagityal District-505 331, TS. Changed My Name as VANGA RAJASHEKAR S/o. Vanga Laxmi Rajam.
NT-311630

★I, MOHAMMED ABDUL RAHAMAN, R/o. 7-2-1014, Mankammathota, Karimnagar, TS, have Changed My Name as MOHAMMED ABDUL RAHMAN, S/o. Mohd Abdul Raoof.
NT-311630

★I, CHALLA BHAGYAVVA, W/o. Challa Balreddy, R/o. 3-84/39, Bandankal, Rajanna Sircilla, TS, have Changed My Name as CHALLA BHAGYALAXMI, W/o. Challa Balreddy.
NT-311630

★I, MOHAMMED ALI (Also Known as) MOHAMMED ALI ABDUL, R/o. 5-6-247/1, Sutharipet, Jagityal, TS. I have Changed My Name as MOHAMMED MOHAMMED ALI S/o. Mohammed Abdul Ali.
NT-311630

★I, KOYA SUMA, D/o. Koya Laxman, R/o. 1-49, Nagulapeta, Korutla, Jagityal, TS. I have Changed after Marriage My Name as DATURKA SUMASRI, W/o. Daturka Nagaraju.
NT-311630

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

హుండీల లెక్కింపు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 27: రేకుర్తి సమ్మక్క-సారలమ్మ జాతర హుండీలను మంగళవారం నగరంలోని రాజరాజేశ్వర కల్యాణమండపంలో లెక్కించారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ నుంచి 21 హుండీలను పోలీసు భద్రత నడుమ తరలించారు. మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆకునూరి చంద్రశేఖర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, జాతర అధికారి ఎండపెల్లి మారుతి, సిబ్బంది, టూటౌన్ పోలీసుల సమక్షంలో హుండీలను విప్పారు. జాతర ఆదాయం మొత్తం రూ. 35,92,550 రాగా, ఇందులో హుండీ ద్వారా రూ. 21,53,820 ఆదాయం వచ్చినట్లు జాతర అధికారి ఎండపెల్లి మారుతి తెలిపారు. మిశ్రమ బంగారం 15 గ్రాములు, మిశ్రమ వెండి కిలో 304 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ శ్రీనివాస్, సభ్యులు, గోవిందపతి శ్రీవారి సేవా సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుడి కల్యాణం

శంకరపట్నం, ఫిబ్రవరి 27: మొలంగూర్ గ్రామంలో భద్రకాళీ-వీరభద్రస్వామి కల్యాణం మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు సోమవారం వీరభద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించగా, మంగళవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిపించారు. అంతకుముందు తెల్లవారుజామున సుంకు నిర్వహించి, అగ్నిగుండాలు వేశారు. భక్తులు అభ్యంగన స్నానాలు చేసి, భక్తిభావంతో అగ్ని గుండాలు దాటారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహించగా, మహిళలు మంగళహారతులతో ఎదురేగి స్వామి వారిని దర్శించుకోగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

స్వామివారి కల్యాణం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై దర్శించుకున్నారు. అర్చకులు ఆయన పేరున అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. శేషవస్త్రంతో సన్మానించి ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ శంకరయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బసవయ్య, నాయకులు తిరుపతి గౌడ్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట, ఫిబ్రవరి27: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం, కబ్జాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సామాజిక కార్యకర్త షేక్ సాబీర్ అలీ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు స్థలాలపై ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఈ విషయంపై హుజూరాబాద్ ఆర్డీవోను విచారణకు ఆదేశించారని తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వీణవంక, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న అదే గ్రామానికి చెందిన పస్తం సమ్మయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. అతడి నుంచి నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

దుర్శేడ్ సింగిల్ విండో చైర్మన్‌గా తిరుపతి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 27: దుర్శేడ్ సింగిల్ విండో చైర్మన్‌గా తోట తిరుపతి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జమునారాణి తెలిపారు. అనంతరం తిరుపతితో ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా, తిరుపతిని సింగిల్ విండో డైరెక్టర్లు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో సీఈవో వేణు, గోనె నర్సయ్య, డైరెక్టర్లు గాజుల అంజయ్య, అంజలి, అంజమ్మ, గాండ్ల అంజయ్య, కందుల రమేశ్‌గౌడ్, సంకరి శేఖర్, రమేశ్, దాడి లచ్చయ్య, బిజిలి పోచయ్య, గాజుల సారవ్వ, నాయకులు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, సుంకిశాల సంపత్‌రావు, మాజీ ఎంపీటీసీ కోరుకంటి వేణుమాధవరావు, ఊరడి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ తోట లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వేణుమాధవ్‌రావు, తిరుపతి, వెంకన్న, వేణు, శ్రీనివాస్, హరికృష్ణ, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 27: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి పవన్‌కుమార్ సూచించారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలతో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించే క్రమంలో మంగళవారం నిర్వహించిన 2కే రన్‌ను కలెక్టరేట్ ఎదుట ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక వృద్ధి సాధించేందుకు అందరూ సహకరించాలని కోరారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ, ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ వద్ద మొదలైన 2కే రన్ గీతాభవన్ చౌరస్తా, బస్టాండ్ మీదుగా కలెక్టరేట్ వద్దకు తిరిగి చేరుకుని ముగిసింది. యూబీఐ డీజీఎం అపర్ణ, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, ఎస్బీఐ చీఫ్ మేనేజర్ రామచంద్రుడు, డీఈవో జనార్దన్‌రావు, మున్సిపల్ కమిషనర్ స్వరూపారాణి, స్పోర్ట్స్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, నాయకులు

'కేసీఆర్‌ను విమర్శిస్తే ఊరుకోం'

చిగురుమామిడి, ఫిబ్రవరి 27: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఇష్టారీతిగా విమర్శలు చేస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య హెచ్చరించారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల చిగురుమామిడిలో జరిగిన బీజేపీ ప్రజాహిత యాత్రలో బీఆర్ఎస్‌ను కించపరిచేలా మాట్లాడడంపై మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఎంపీగా హుస్నాబాద్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందేనని, ఇరుపార్టీలు తెరచాటు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో మాజీ సర్పంచులు జక్కుల రవీందర్, సన్నీల్ల వెంకటేశం, బోయిని శ్రీనివాస్, సుద్దాల ప్రవీణ్, ఎంపీటీసీ మిట్టపల్లి మల్లేశం, నాయకులు చెప్యాల నారాయణరెడ్డి, మగ్బుల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

తిమ్మాపూర్/ కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 27: అలుగునూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. కరీంనగర్ ముఖద్వారం అలుగునూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపు మల్లారెడ్డి, కాల్వ మల్లేశం, చందం కిష్టయ్య, ఎలకపల్లి సంపత్, మామిడి అనిల్, మాచర్ల అంజయ్య, గూడ కనకయ్య, సిరిసిల్ల చంద్రయ్య, నర్సయ్య, పార్టీ శ్రేణులతోపాటు అంబేద్కర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 27: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా 56 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, విద్యార్థులను 45 నిమిషాల ముందు నుంచే పరీక్ష కేంద్రంలోని అనుమతిస్తారు. పరీక్ష ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుండగా, ఒక నిమిషం ఆలస్యమైనా హాల్‌లోకి అనుమతించమని అధికారులు తెలిపారు.

మానకొండూర్/హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 27: మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కేంద్రంలో ప్రథమ సంవత్సరంలో 107, ద్వితీయ సంవత్సరం 122, నలుగురు ప్రైవేట్ విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. అలాగే, హుజూరాబాద్ పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 892 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

కరీంనగర్‌లోని కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

హుజూరాబాద్ డిపోకు రూ.54.95 లక్షల ఆదాయం

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 27: సమ్మక్క, సారలమ్మ మేడారం జాతర సందర్భంగా హుజూరాబాద్ డిపోకు రూ.54,95,842 ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడారం సమ్మక్క జాతరను పురస్కరించుకొని నాలుగు రోజులపాటు డిపో నుంచి ప్రత్యేకంగా 60 బస్సులను నడిపినట్లు తెలిపారు. జాతర కోసం అంకితభావంతో పని చేసి సంస్థకు ఆదాయం సమకూర్చడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

వీణవంక, ఫిబ్రవరి 27: జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా మామిడాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకున్నది. హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు తాటి రాజేశ్వర్ రావు, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు నిధులు విడుదల చేయాలని వినతి

హుజూరాబాద్ రూరల్/ టౌన్, ఫిబ్రవరి 27: ప్రభుత్వం నియోజకవర్గంలోని దళిత బంధు లబ్ధిదారులకు రెండో విడుత నిధులు వెంటనే మంజూరు చేయాలని ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో సునీతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాకేశ్, నాయకులు రాజు, రాకేశ్, సదానందం, అశోక్, శ్రీనివాస్, సందీప్, సాగర్, అనిల్, రామ్, అభిలాష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

జమ్మికుంట, ఫిబ్రవరి27: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు ఆకాంక్షించారు. మంగళవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో జీవన జ్యోతి పట్టణ సమాఖ్య మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. పట్టణ సమాఖ్య ద్వారా అర్హులైన వారికి పథకాలను అందించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అయాజ్, డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మల్లీశ్వరి, సీఆర్‌పీలు జ్యోతి, సరళ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 27: పట్టణంలోని న్యూ శాతవాహన హైస్కూల్‌లో మంగళవారం ఫేర్‌వెల్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఆదర్శ పాఠశాల కరస్పాండెంట్ పరాంకుశం కిరణ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వీ స్వరూపారాణి, ఉపాధ్యాయులు శ్రీధర్, షాహిన్, కుమారి, సతీశ్, రాజేశ్, రమాదేవి, రాజు, నరేందర్ పాల్గొన్నారు.

అట్టహాసంగా లక్ష్ మినీ ఫెస్టివల్

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జైపాల్ రెడ్డి తదితరులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 27: జిల్లా కేంద్రంలోని లక్ష్ ఇంటర్నేషనల్ పాఠశాలలో మంగళవారం లక్ష్ మినీ ఫెస్టివల్ అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి హాజరై ప్రారంభించారు. అతిథులుగా 'క్వాంటం మైండ్ ఐక్యూ' డైరెక్టర్ జోసెఫ్ జాన్సన్, సీఈవో క్లైమెంట్ రాజు వ్యవహరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ముస్తాక్ అలీ, డైరెక్టర్ షేక్ అఫ్సానా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 27: పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో మంగళవారం జిల్లా సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య జిల్లా, హుజూరాబాద్ డివిజన్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా రేణుక, సంయుక్త కార్యదర్శులుగా సంధ్యారాణి, సరిత, తేజ, ప్రచార కార్యదర్శిగా వాసవి, డైరెక్టర్‌గా రాజయ్య ఎన్నికయ్యారు. హుజూరాబాద్ డివిజన్ కమిటీ ఉపాధ్యక్షుడిగా శ్యామలరావు, సంయుక్త కార్యదర్శులుగా శ్రీలత, స్వప్న, కోశాధికారిగా తిరుమల, ప్రచార కార్యదర్శులుగా లావణ్య, శ్రీలత, రాజేశ్వరి, రమేశ్‌ను ఎన్నుకున్నారు.

ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి

సైదాపూర్, ఫిబ్రవరి27: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, వాటిని సాధించేందుకు పట్టుదలతో ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ బొట్ల రామస్వామి సూచించారు. మండల కేంద్రంలోని వెన్కేపల్లి ఉన్నత పాఠశాలలో భూమిక మహిళా కలెక్టివ్ హైదరాబాద్, వెన్నెల మహిళా ఫెడరేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భూమిక మహిళా కలెక్టివ్ సభ్యులు వెన్నెల, వెన్నెల కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో నేషనల్ సైన్స్ డే

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 27: మండలంలోని కిట్స్ కళాశాలలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆర్సీ 22, పాపులర్ సైన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నేషనల్ సైన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా సెంట్రల్ యూనివర్సిటీ భౌతిక శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ జీ మనోజ్ కుమార్ హాజరై మాట్లాడారు. సైన్స్ డే నేపథ్యాన్ని వివరించడంతో పాటు ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహాయంతో జరుగుతున్న పరిశోధనలు, నూతన ఆవిష్కరణల గురించి తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎంవీ సతీశ్ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లయ్య, నేషనల్ సైన్స్ డే సమన్వయకర్త డాక్టర్ రవికుమార్, అధ్యాపకులు డాక్టర్ రమణీకుమారి, డాక్టర్ కే మధులత, మహేందర్ రావు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి

బోయినపల్లి, ఫిబ్రవరి 27: టిప్పర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన బోయినపల్లిలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం వెంకంపల్లి అనుబంధ గ్రామం పిట్టలపల్లికి చెందిన గోదల కమలాకర్(42) గంగాధరలో సూపర్ మార్కెట్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కమలాకర్‌కు ఓ వ్యక్తితో భూ తగాదాలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్స్ తెచ్చుకోవడానికి వేములవాడలోని కోర్టుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో ఉన్న పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి వచ్చి, మృతదేహంతో ఆందోళన చేపట్టారు. వేములవాడ గ్రామీణ, పట్టణ, చందుర్తి సీఐలు శ్రీనివాస్, కరుణాకర్, కిరణ్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని సముదాయించారు. అనంతరం సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. అజాగ్రత్తగా టిప్పర్ నడిపి కమలాకర్ మృతికి కారణమైన మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ బాపురావుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.